# అభిమానం

—ఎస్. చంద్రశేఖర్



"ఏమండీ ఈ పదేళ్ళలో మిమ్మల్ని నేనేం అడగలేదు. రాంబాబుకు పరీక్షలు. చెప్పిన మాటలు వినడం లేదు. నాకు ఓపిక లేదు..... కారణం తెలియదుగాని, జానీగాడు ఓ వారం మంచి భోజనం మానేశాడు. నాకేదో భయంగా వుంది. మీకు వీలయితే ఓ మారు వాడిని ఆస్పత్రిలో చూపించండి."

ఇట్లు
సావిత్రి



**సుగుణ అంటే సత్యన్నారాయణ రెండవ భార్య. ఆమె అతని సర్వస్వం మాత్రం కాదు. లేదంటే ఆమెను ప్రేమించి పెళ్ళాడాడు.**

ఆమె నర్సు ఉద్యోగం మాన్పించాడు. మొదటి భార్య సావిత్రిని, కొడుకు రాంబాబును వదలిపెట్టాడు. ఈ పది సంవత్సరాలలో సావిత్రి బట్టలు కుట్టి, పరమేశ్వరి థియేటరు దగ్గర్లో, చిన్న దుకాణం పెట్టి, పొట్టపోసుకుంటూ కొడుకును చదివించుకుంది. కొడుకు పుట్టిన సంవత్సరంలో సత్యన్నారాయణ ఇంటికి ఒక కుక్క పిల్లను తెచ్చాడు. వాడి పేరు జాని. సావిత్రిని వదిలేయక ముందు జానిగాడు సత్యన్నారాయణకు ప్రాణం. సావిత్రిని వదిలేసిన రోజు సత్యన్నారయణ జానీని వుంచేసి వెళ్ళమన్నాడు. కాని వాడికి సావిత్రిపైన అభిమానం. వాడి భోజనం, వాడి స్నానం సావిత్రి చూసేది. సావిత్రి ప్రక్కనే పడుకుండేవాడు.

సుగుణకు పెద్ద సంతానం. దానితో సత్యన్నారాయణ ప్రేమ కొంత కరిగిపోయింది. సావిత్రిని పూర్తిగా మరచిపోలేకపోయాడు. ఇంటి దగ్గర చికాకుపడ్డప్పుడు కంచరపాలెం వెళ్ళి పరమేశ్వరి థియేటరు దగ్గర, టీ స్టాలులో కూర్చుని, దగ్గరగా వుండే భార్య రెడీమేడ్ షాప్ వైపు చూస్తూ వుండేవాడు. అటువంటప్పుడు జానీగాడు దగ్గరలో వుంటే, పిలిస్తే వాడు హాజరైపోయి, సత్యనారాయణని ముద్దుల్లో ముంచేసేవాడు. సావిత్రి అసలు మాట్లాడదు కాబట్టి, జానీతో ఆడుకుంటే, ఎంతో సంతోషం, ఎంతో ఆనందం. ఆడుతూ, ఆడుతూ వాడు సావిత్రి వద్దకు పరుగెడుతూ తిరిగి వెనక్కి వచ్చి, ఏదో మూగ భాషలో సత్యన్నారాయణతో మంతనాలాడేవాడు.

సావిత్రి ఎప్పుడూ దగ్గుతూ వుండేది. ఆమె దగ్గితే సత్యన్నారాయణ కూర్చునే టీ స్టాలు దగ్గరకు వినిపించేది. ఒకసారి సత్యన్నారాయణ ఆమెకు బోలెడన్ని మందులూ, టానిక్కులు పంపించాడు. కాని ఆమె వెంటనే తిరస్కరించి, వెనక్కు పంపింది.

సావిత్రి కొడుకు రాంబాబుకు తండ్రిపైన మక్కువ. అప్పుడప్పుడు తండ్రిని ఆఫీసులో కలిసేవాడు. కలిసినట్లు సావిత్రికి చెప్పేవాడు కాదు. సావిత్రికి జరిగిన అన్యాయంకొద్దీ, సత్యన్నారాయణ బాధపడుతూ వుండేవాడు. రాంబాబును మంచి చదువులు చదివించాలనే అభిప్రాయం కలిగివుండేవాడు. రాంబాబు పుట్టిన రోజుకు మాత్రం కొత్త బట్టలు పంపిస్తే, సావిత్రి కోపం తెచ్చుకొనేది కాదు. రాంబాబు బాగా చదివేవాడు. అప్పుడప్పుడు స్కూలు పోటీల్లో తెచ్చుకున్న సర్టిఫికెట్లు, ప్రైజులు ఆఫీసుకు తీసుకెళ్ళి వాళ్ళ నాన్నకు చూపెట్టేవాడు.

సుగుణ పిల్లలకు చదువు అట్టే రాలేదు. కాని, ఆటలు, పాటలు, రేడియో, టి.వి. ప్రోగ్రాములలో ఆసక్తి మెండు. సుగుణకు పిల్లలంటే అతి గారాబం. సుగుణ వుద్యోగం మాన్పించినందుకు చీటికి మాటికి భర్తపైన సాధిస్తుండేది. ఈ సాధింపులు భరించలేక ఆఫీసు

నుంచి బాగా ఆలస్యంగా వచ్చేవాడు.

జానీగాడితో ఆడుకున్నప్పుడున్నంత సంతోషం కాని, రాంబాబుతో ఎంత మొగమాటంతో మాట్లాడినా, అందులో దాగి వుండే సంతోషం కాని, తన ఇంట్లో వచ్చేదిగాదు.

సత్యన్నారాయణ తరచూ హైద్రాబాదు ఆఫీసు పనుల మీద క్యాంపు వెళ్ళివస్తూ వుండేవాడు. గోదావరి రైలు సాధారణంగా ఆలస్యంగా రావడమే కాక, రామ్మూర్తిపంతులు పేట క్రాసింగు దగ్గర కాసేపు ఆగేది. అప్పుడు అవకాపల్లి కూరగాయల బుట్టలన్నీ దిగేవి.


జానీగాడిని చూడాలంటే, సత్యన్నారాయణ రైల్లోంచి దిగేసి, తిన్నగా టీ కొట్టు దగ్గరకు పోయి జానీ కోసం చూసేవాడు. అది వచ్చాక వాడికి బిస్కట్లు పెట్టి, తను టీ తాగి, ఆనక టవున్‌లోకి వచ్చేవాడు.

అవి దసరా రోజులు. నాలుగైదు రోజులు సత్యన్నారాయణ ఆఫీసుకు వెళ్ళలేదు. దసరా తర్వాత ఆఫీసులో ఒక ఉత్తరం వచ్చింది. అది సావిత్రి వ్రాసింది. పదేళ్ళలో మొదటి ఉత్తరం. దాని సారాంశం ఇలా వుంది. "ఏమండీ, ఈ పదేళ్ళలో మిమ్మల్ని నేనేం అడగలేదు. రాంబాబుకు పరీక్షలు. చెప్పిన మాటలు వినడం లేదు. నాకు ఓపిక లేదు. కారణం తెలీదుగాని, జానీగాడు ఓ వారం నించి భోజనం మానేశాడు. నాకేదో భయంగా వుంది. మీకు వీలయితే ఓ మారు వాడిని ఆస్పత్రిలో చూపించండి. ఇట్లు సావిత్రి."

ఉత్తరం చూశాక కొంత సంతోషం, కొంత బాధ కలిగింది. ఏళ్ళ తరువాత, ఏదో విధంగా సావిత్రిని దగ్గరగా చూడవచ్చు. వీలయితే మాట్లాడవచ్చు. బోలెడన్ని మందులు, టానిక్కులు స్వయంగా ఇవ్వవచ్చు. జానీగాడికి, వాడి ఇంటిలో కలవడం కంటే ఇంకేముం టుంది. కాని, వాడికి ఏమయిందో ఏమో. అయినా రేపు ఆదివారం. సోమవారం అయితే మంచి డాక్టరుకు వాడిని చూపెట్టవచ్చు అని అనుకుంటూ వుండగానే, హైద్రాబాదు నించి టెలిగ్రాం రావడం, ఏదో మీటింగు కార్యక్రమంలో హైద్రాబాద్ వెళ్ళడం, తిరిగి శుక్రవారం వుదయం గోదావరిలో విశాఖ వస్తూ వున్నాడు.

రైలు రామ్మూర్తిపంతులు పేట క్రాసింగు దగ్గర ఆగింది. సత్యన్నారాయణ వెంటనే దిగేసి, పరమేశ్వరి థియేటరువైపు వెళ్ళాడు. అక్కడ టీ కొట్టు దగ్గర జానీగాడు అతి నీరసంగా ముఖం పెట్టి సత్యన్నారాయణని నాకటం మొదలెట్టాడు. సావిత్రి గత పది రోజుల నించి దుకాణం తియ్యలేదని టీ కొట్టువాళ్ళు చెప్పారు. ఇంతలో జానీగాడు సత్యన్నారాయణ చెయ్యి పట్టుకొని, వాడి ఇంటివైపు లాక్కెళ్ళాడు.

అదో సందు. ఆ సందులోకి పోవడంతోటి సత్యన్నారాయణకు ఏదో సంశయం, ఆందోళన ప్రారంభమయింది. ఇంటి ముందు బోలెడంత జనం. సావిత్రి ఆ రోజే చచ్చిపోయింది. ఆమె గత పది రోజుల నించి తిండి మానేసింది. ఆ రోజుతో ఆమె క్షయ వ్యాధికి అంతం. రాంబాబుకు జ్వరం. బంధువులకు టెలిగ్రాములు ఇవ్వడం, కబురు చేయడం లాంటి వాగ్వివాదాలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. దగ్గరగా వెళ్ళి సావిత్రిని చూశాడు. సత్యన్నారాయణ ఫలానా మనిషని అందరూ పసిగట్టేశారు. వాళ్ళల్లో గుసగుసలు కూడా ప్రారంభం అయ్యాయి. ఇంతలో ఆపుకోలేని ఏడుపు సత్యన్నారాయణలో ప్రారంభం అయింది. రాంబాబు కోసం అటూ ఇటూ చూశాడు. వాడు ఏడ్వలేని పరిస్థితిలో ఓ మూల పడివున్నాడు. వాడి పక్కలో జానీగాడు కూడా పడివున్నాడు. కానీ వాడికి శ్వాస లేదు. ఎంతో నిరాడంబరంగా కళ్ళు తెరుచుకొని చూస్తున్నట్లుగా వున్నాడు. అప్పు డర్థమైంది సత్యన్నారాయణకు. జానీగాడు అభిమానం కొద్దీ సావిత్రితో భోజనం మానేశాడు. సావిత్రితో వెళ్ళిపోయాడు. ●




## పంట

ఒకప్పుడు బాగా సంతానం కలిగివుంటే గొప్ప. వీర్యశక్తి కలిగివుంటే గొప్ప వీరుడితో సమానం. పూర్వకాలంలో సంతానాభివృద్ధికి, పశుసంపద వృద్ధి చేయడానికి, పంటలు బాగా పండడానికి ఎక్కువ ప్రాముఖ్యాన్నిచ్చేవారు. దానికోసం వాళ్ళెన్నో మతపరమైన పనులు చేసేవాళ్ళు. పూర్వకాలం రోమ్‌లో పురుషాంగాన్ని పోలిన పెద్ద బొమ్మనొకదానిని తయారు చేసి వూరంతా తిప్పేవారుట. పైగా బహిరంగంగా జంటలు శృంగారం జరుపుకునే వారుట. ఇదంతా పంటలు బాగా పండటానికట. ఇసేరకం పద్ధతులు ఇంకా నేటి నాగరికతకు అలవాటుపడని తెగలలో, ప్రాంతాలలో కొనసాగుతూనే వున్నాయని పరిశోధకులు చెపుతూనే వున్నారు. కాముని పున్నమి కూడా ఇట్లాంటిదే అనుకోవచ్చు. మధ్య ఆఫ్రికా 'బాగండా' అనే ప్రాంతంలో, కవలల్ని కన్న తల్లి తొడలని పూలతో అలంకరించి పరుండబెడితే, ఆ కవలల తండ్రి ఆ పూలను ఒక్కొక్కటిగా తన పురుష శక్తితో తోసేస్తాడట. అక్కడ ఇలా వుంటే మధ్య అమెరికా 'పిపైల్స్' అనే ప్రాంతంలో పొలాల్లో విత్తనాలు జల్లడానికి గానీ, నాట్లకుగానీ నాలుగు రోజుల ముందరే జంటలు శృంగారాన్ని జరుపుకోవడం మానేస్తారట. ఈ నియమంకూడా పంటలు బాగా పండడానికేనట. పసిఫిక్ ద్వీప ప్రాంతాల్లోనయితే, అప్పుడే యవ్వనంలోకి అడుగు పెట్టిన అమ్మాయిలకు, అబ్బాయిలకు శృంగారం గురించి పూర్తిగా నేర్పుతారట — అభ్యాసాలతో సహా. తర్వాత శృంగారం జరుపుకుంటున్న జంటనొక దానిని ఎన్నుకుని గోతిలోకి తోసి చంపేవారట. ఇదొకరకమైన బలి అనుకోవాలి. ఎంత దారుణం!! ఈ నాగరిక ప్రపంచంలో ఇట్లాంటి వాటికి తావులేదు. ఇప్పుడు ప్రపంచం అంతా అనుకుంటున్నది — జనాభా ఎట్లా తగ్గించాలా అన్నదే! ఇట్లాంటి పరిస్థితుల్లో సంతాన నిరోధక మాత్రలు వాడినా ఒక ఆస్ట్రేలియా ఆవిడ తొమ్మిది మంది పిల్లల్ని కన్నదట. ఇట్లా అయితే, ఈ జనాభాని ఎట్లా ఆపడం?

—రిలేకరి

